కథ

# అందుకోనా సంతోషాన్నలా...

''నే చెబుతున్నదేవన్నా తల కెక్కు-తోందా నీకు?'' వంటగది లోంచి హైపిచ్‌లో మాట్లాడుతూ వచ్చి, నా చేతలోని న్యూస్ పేపర్‌ని రెండుముక్కలు చేసిన తర్వాత కానీ అమ్మ చెప్పిన విషయం పూర్తిగా బుర్రలోకెక్క-లేదు.

తలెత్తి ఏవిటన్నట్టు చూశా.

''ఏడాదిన్నరవుతోంది నీకు పిల్లను వెదక బట్టి. ఇప్పటికి ఏడూర్లు తిరిగి ముగ్గుర్ని చూసొచ్చావ్. ఈసారి పెళ్ళిచూపులకెళ్ళకుండా వెనక్కు- తిరి రావటమో, పెళ్ళివారింట్లో అలంకరణ నచ్చలేదనో, ముంగిట్లో ముగ్గు బాలేదనో చచ్చు కారణాలు చెప్పావంటే.. యిదిగో చూస్తున్నావుగా నీ బుర్రపగల కొడతా'' చేతిలో గరిటెను తిప్పుతూ చెప్పింది.


గట్టిగానే తగిలింది దెబ్బ. ''అబ్బ వెడతానంటుంటే ఏవిటే నీ నస..'' మళ్ళీ తగిలింది.

కళ్ళు నలుపుకుంటూ చూశా.. బస్సుకు సడన్‌బ్రేక్ పడటంతో ముందుసీటుకి తల గుద్దుకున్నట్టుంది. ఓ నిట్టూర్పు..ఈ కల రావటం యిది రెండోసారి.

కిటికీలోంచి చూశా. ఊరు చేరేందుకు యింకా పది కిలో మీటర్ల దూరంలో వున్నా.

★★★

టి. రెహతాజ్ బేగం




నేను ఇందూధర్.

ఈమధ్యే ఓ ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పోస్టింగ్ వచ్చింది. అందులో చాలా కాలం క్రితం, కొన్నేళ్లు మేముండి వెళ్ళిన ఊళ్లోనే... యిప్పటికి బాగా డెవెలప్ అయిన టౌన్ అది.

కాకతాళీయంగా అదే ఊరికి మా బాబాయ్ కూ-డా ట్రాన్స్‌ఫర్ రావటంతో నాకిల్లు వెతుక్కో-వాల్సిన పని తప్పింది.

నాకున్న చాలా దగ్గరి స్నేహితుల్లో ఈ ఊరినీ ఒకటిగా లెక్కే-సుకుంటాన్నేను. ఒకప్పుడు కాస్త అటూయిటుగా ఓ రెండేళ్ళకన్నా ఎక్కు-వ వుండలేదీ ఊళ్ళో. నా స్కూ-లింగ్ చివరి రెండేళ్ళు యిక్కడే గడిచాయి.

బాల్యం మనల్ని విడిచివెళ్ళిపోతూ..కౌమారంతో పరిచయం చేయించాక..మనకు స్నేహమయ్యే ప్రతీ చిన్న విషయం...భావుకతలో మునిగితేలుతూ..మనసు గదిలో ఓ మూల నిక్షిప్తమై పోతుంది.

బహుశా అందుకేనేమో నా టీనేజ్ సజీవంగా కన్పించే ఆ ఊరి పరిసరాలంటే నాక్కాస్త ఆపేక్ష ఎక్కు-వ.

పోస్టింగ్ యిక్క-డికని తెలిసాక, వేరేచోట బదిలీ చేయించుకోవాలన్న నా ప్రయత్నాలు ఫలించలేదు. నాకత్యంత యిష్టమైన గతాన్ని మధుర జ్ఞాపకంగా మలుచుకున్న తర్వాత, దాన్ని వర్తమానంలోకి తీసుకురావటం నాకంతగా యిష్టముం

**ఆంధ్రభూమి దిన పత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన కథ**

డదు. అందులోని ఎసెన్స్ ఎగిరిపోతుందన్న చిన్న అనుమానం వల్ల.

దీర్ఘం తీస్తూ బస్సుకి బ్రేక్ పడింది.

జుట్టు సవరించుకుంటూ కిందకడుగుపెట్టగానే చేతిలో బ్యాగుని ఎవరో లాగినట్లన్పించి అరవబోతూ చూస్తే అక్కడున్నది దొంగకాదు..గజ దొంగ వంశీ. మా బాబాయ్‌గారి సుపుత్రుడు.

★ ★ ★

నిండు పౌర్ణమికింకా నాలుగురోజులు ఉన్నట్టుంది.

చంద్రుడింకా పూర్ణరూపాన్ని సంతరించుకోలేదు.

వరండాలో వేసిన నవారు మంచంపై వాలగానే మల్లెపందిరి మధ్యలోంచి నవ్వుతూ కన్పించాడు.

కోయకుండా వదిలేసిన మల్లెలు..గాలి వీచినపుడల్లా ఒక్కొక్కటీ సుకుమారంగా మీద రాలుతున్నాయి.

తమలపాకు నములుతూ మెల్లగా వచ్చి పక్కన కూర్చున్నాడు బాబాయ్.

''నిన్న రాత్రి నువ్వు బయల్దేరాక వదిన ఫోన్ చేసిందిరా అబ్బాయ్! ఎందుకనడగవేం?..సరే, నేనే చెబుతా..రేపెల్లాగైనా నిన్ను పెళ్ళిచూపులకు పంపమని చెప్పింది. ఈ సంబంధానికైనా గ్రీన్‌సిగ్నల్ యిచ్చేయ్‌రాదు!''

నేనేమీ మాట్లాడకపోవడంతో మళ్ళీ మొదలెట్టాడు. ''ఒరేయ్ ఇందూ! మొన్నీమధ్య నాకో కొత్త విషయం తెల్సిందిరా, ఏదో పుస్తకంలో చదివా. ఎవరో మీ పిన్నిలాంటి భార్యలను చూసి రాసారనిపించింది. లోకంలో భర్తలకన్నా భార్యలే ఎక్కువ సంతోషంగా వుంటార్ట. ఎందుకో తెలుసా?''

నాకర్ధమయ్యి అర్ధంకానట్టన్పించింది.

''ఎందుకంటే భార్యలకు భార్యలు వుండకపోవటం వలనట!''

ఫక్కున నవ్వొచ్చింది నాకు.

గలగలా నవ్వేస్తూ ''ఏదేమైనా జీవనసాగరంలో ఆడా-మగ బంధం చుక్కాని, నావ సంబంధం లాంటిది. ఒకరు లేకపోతే యింకొకరు అసంపూర్ణం. అందుకే పెళ్ళి చేసుకోవాలి. నీకూ తెలుసనుకుంటా?'' కాసేపాగి ''స్టూల్‌పై అమ్మాయి ఫోటో వుంది చూడు'' అంటూ యింట్లోకెళ్ళిపోయాడు.

అప్రయత్నంగా, గబుక్కున కవర్‌లోంచి ఫోటో తీసి చూశా..పేరు 'కవిత' నా కళ్ళల్లో చిరునవ్వు..వయ్యారంగా వీచిన ఓ పిల్లగాలి స్పర్శకు మల్లెలు రాలాయి నాపై..చాలాసేపటి వరకు నిద్రపట్టలేదు..వంశీ గురక శబ్దం వల్ల.

★ ★ ★

''అబ్బ యింత ఉదయాన్నే మైదానాలు పట్టుకు తిరగటమేంట్రా..నీ చాదస్తం కాకపోతే...ఇదిగో అసలే మనవి కొత్త మొహాలు, యిక్కడి యింటిగలవాళ్ళు మనల్ని దొంగలనుకోగలరు'' ఊలు శాలువాను తలకు చుట్టేసుకుంటూ దీనంగా చెప్పుకుపోతున్నాడు వంశీ.


అదీమధ్యే కొత్తగా కట్టిన కాలనీ. శ్రద్ధగా అమర్చిబడ్డ ఒకే సైజ్ బొమ్మల్లా వున్నాయి యిళ్ళన్నీ. ఓ మూడేళ్ళ క్రితం వరకూ కూడా అక్కడ వ్యవసాయ భూములుండేవి. వర్షాల్లేక, దిగుబడి రాక వాటిని ప్లాట్లు చేసి అమ్మేసారు.

కాలనీ మధ్యలో ఓ ఎకరం విస్తీర్ణంలో వుందా యిల్లు. అప్పుడెవరో తోట యజమానులు కట్టించిన చిన్న ఫామ్‌హౌస్ ఓ వ్యవసాయ బావి, చుట్టూ కంచె, అక్కడక్కడా మామిడిచెట్లు, పూలమొక్కలు, లేటెస్ట్ మోడల్ ఫ్లాట్రాన్ టీవీలో బ్లాక్ అండ్ వైట్ సినిమా చూస్తున్నట్టుంది.

అంత ఉదయాన్నే నేనక్కడికి వెళ్ళింది అలాంటి దృశ్యం చూసేందుకే. కానీ నాలుగు ఫర్లాంగుల దూరంలోంచే యిళ్ళు కన్పించటంతో అక్కడ మునుపటి వాతావరణం లేదన్పించింది. కానీ లోపల ఈ దృశ్యం ఆశ్చర్యం కల్గించింది.

''నీకు గుర్తుందా...? ఒకప్పుడు మనం ఫ్రెండ్స్‌తో కలిసి ఈ చింతచెట్లు దగ్గరకొచ్చేవాళ్ళం. అప్పుడు కొమ్మలు కూడా సరిగ్గా అందేవి కావు. నువ్వింటి నుండి స్టూల్ తెచ్చుకుని దాన్నెక్కి మరీ చింతకాయలు కోస్తూ తెగ తంటాలు పడేవాడివి.''

''అక్కడ చాక్లెట్ కలర్ బిల్డింగ్ వున్న చోట ఓ తోటుండేది'' వంశీకి లీలగా ఏదో గుర్తొచ్చినట్టుంది.



## రంభ రూటే వేరు!

రంభ సినిమాల్లోకి వచ్చి దాదాపు పదిహేనేళ్లవుతోంది. టాప్ హీరోలందరితో నటించిన రంభ ఇటీవల కాలంలో స్టార్ రేస్‌లో కాస్త వెనకబడినా తిరిగి కొత్త గ్లామర్‌తో ఈమధ్య కొన్ని సినిమాల్లో కనిపిస్తోంది. అయితే కొంతమంది హీరోయిన్లలా కొంత కాలం గ్యాప్ తర్వాత వదిన పాత్రలు, తల్లి పాత్రలు పోషించడానికి రంభ సుముఖంగా లేదని ఆమె సన్నిహితులంటున్నారు. హీరోయిన్‌గా వచ్చాను, హీరోయిన్‌గానే వుంటూ సినిమాలకు గుడ్‌బై చెబుతాను అనే దృఢనిర్ణయంతో రంభ వున్నట్టు సినీజనాల ఉవాచ. మంచిదే!

''ఓసారి నువ్వు నేను, శాంతి గాడు, బుజ్జి, నీ క్లాస్‌మేట్ నాగన్న అక్కడ సపోటాలు దొంగతనం చేసాం. గుర్తొచ్చిందా!''

వాడు చిన్నగా నవ్వి ''మర్చిపోయే విషయమా అది. కంచె దాటుకుని లోపలికెళ్ళేందుకెంత కష్టపడ్డా. తోట మాలి కూతురు మనల్ని తరమడం, బైటపడే ప్రయత్నంలో కంచె తగిలి కాళ్ళకు గాయాలు.. అది చూసి పెద నాన్న మనల్ని చావబాదటం, అంతా అయ్యాక కొసమెరుపుగా ఒక్క పండూ తినడానికి రాలేదు. అన్నీ పచ్చివే..''

హిహి..హిహి..వాడింకా ఏదో చెప్తుకుపోతున్నాడు.

పరిగెత్తుతూ వెళ్ళి మళ్ళీ ఆరోజును దోసిళ్ళలో నింపుకురావాలన్పించింది. వెనకేదో అడుగుల చప్పుడు విన్పిచ్చి ఈ లోకంలోకొచ్చాం. పూర్తిగా తెల్లారిపోయింది.

★ ★ ★

''యమగండాలు రాకముందే లోపలికి అడుగుపెట్టండి బాబు'' లోపల్నించి ఎవరో చెప్పారు.

వంశీగాడు కిసుక్కున నవ్వి ముందుకు తోసాడు.

సినిమాల్లోలా రొటీన్‌గా తెలుగుతనం నిండిన పెళ్ళిచూపులు జరగలేదా రోజు. నాకా ఉత్సుకతా రాలేదు. నాకు అరేంజ్‌డ్ మేరేజెస్ అంటే పెద్దగా విముఖత లేకపోయినా, నా జీవితంలో ప్రతీ ముఖ్య ఘట్టం కాస్త ప్రత్యేకంగా ముగియాలనే మనస్తత్వంలో యిన్నాళ్ళూ నాక్కాబోయే భార్యను నేనే వెతుక్కోవాలనుకున్నా. కానీ దైవసంకల్పమనుకుంటా నా ప్రయత్నాలేవీ ఫలించకపోగా అప్రయత్నంగా ఈ అమ్మాయిని చూసేందుకొచ్చా.

చాలా కాజువల్‌గా మాటలు మొదలయ్యాయి.


ఫోటోలో కన్నా బావున్నట్టనిపించింది.

గుండెకొట్టుకున్న శబ్దం విన్పిచ్చకపోయినా, నే కోరుకున్న లక్షణాలు అతికినట్టు ఆమెలో కన్పించకపోయినా, కాదనేందుకు ఓ కారణం దొరకలేదు. నా అన్వేషణ పూర్తవకముందే రాజీ పడిపోదామన్పించింది.

ఆలోచించే వ్యవధి యివ్వకుండా అమ్మా, బాబాయ్ కల్సి నా చేత ఊ కొట్టించారు. నేనింకా ఊహకూ, వాస్తవానికి మధ్య వుండగానే నిశ్చితార్థం జరిగిపోయింది.

నెలరోజుల తర్వాత పెళ్ళి ముహూర్తం.

ఈ మధ్యలో సెల్‌ఫోన్‌లో పొట్టి సందేశాలు..మెయిన్‌రోడ్ సందట్లో నిశబ్ద నడకలు..తన కురించి యింకా ఏదో తెల్సుకోవాలన్న కుతూహలంతో జాగింగ్ పేరుతో తనింటి చుట్టూ నా చక్కర్లు. గంటల తరబడి కబుర్లలో తన డైరీలో అక్షరాల్ని మాటలుగా మలచి నాకు చెప్పేది.




''తక్కువగా మాట్లాడతారేం'' అనడిగితే ఓ చిరునవ్విచ్చేవాణ్ణి.

అంతగా మాట్లాడటం అలవాట్లేని నాకు బాధ్యతగా సంభాషణ పొడిగించటం చికాగ్గా వుండేది. ఎవరో నన్ను కట్టిపడేస్తున్న ఫీలింగ్ కలిగింది. కానీ క్రమంగా మా మధ్యలో మంచి కెమిస్ట్రీ డెవలప్ అయ్యిందనిపించింది. పెళ్ళి బాటలో స్నేహమనే మొదటి మెట్టనిపించింది.

★ ★ ★

''నా బర్త్‌డేకి ఏ గిఫ్ట్ యిస్తున్నావని'' అడిగితే సన్నగా వేణువూదినట్టు నవ్వింది.

అర్ధరాత్రి పన్నెండింటికి, అర్థవంతమైన కొటేషన్ మీద ''హేపీబర్త్‌డే!'' అంటూ ఓ మెసేజ్.

''ఉదయం ఐదింటికి ఫామ్‌హౌస్ కొస్తే మీ బహుమతి తీసుకోవచ్చు'' మరో మెసేజ్.

ఐదౌతుండగా మెల్లగా అక్కడికి చేరుకున్నా, తలుపు తీసేవుంది నిశ్శబ్దంగా. ఆకురాలు కాలపు, పేరు తెలియని పరిమళంతో నిండిన చల్లనిగాలి, పడమరకు చేరుకుంటున్న చంద్రుడు.

తను కన్పిచ్చట్లేదేవిటని యింటి తలుపు తెరగానే బిగ్గరగా అరుపులు..బర్త్‌డే సాంగ్ రిథమిక్‌గా విన్పిస్తోంది. అక్కడ ఓ ఐదారుమంది యువకులు, మరో కొత్తగా పెళ్ళయిన జంట కన్పించారు. వాళ్ళలో వంశీని వాడి ఫ్రెంచ్ నాగన్నను మాత్రమే గుర్తుపట్టా. కొన్ని క్షణాల తర్వాత మొహాలు చాలా వరకు మారినా, వారంతా స్కూల్‌ఫ్రెండ్స్ అని త్వరగానే గుర్తుపట్టా.

విస్తుపోవటం నావంతైంది.

సెలయేటి గలగలలా అరగంటసేపు పన్నెండేళ్ళ క్రితం నాటి మాటలు..ఆనాటి నవ్వులు..దొంగ ఏడుపులు..అర్థం పర్థం లేని జోకులు..వచ్చు సాహసాలు..స్వచ్ఛమైన స్నేహాలు..యిప్పటికీ తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోయిన వీధి గొడవల్లోని గాయాల గుర్తులు..ఆ ఊరి కొండలు.

కాసేపు నిశ్శబ్దం. కొన్ని ఆనందబాష్పాలు. అందరం ఒకరి గురించి మరొకరు తెల్సుకోవటంతో చాలా సమయం గడిచింది. ఆ సందట్లోపడి వంశీ చెప్పాక కానీ తెలియలేదు. మేమందరమలా ఒకచోట కలవటం ఎలా సాధ్యమైందో. వంశీ సాయంతో కవిత నా పాతస్నేహితుల ఫోన్ నంబర్లు కనుక్కొని, ఎంతో శ్రమపడి అందర్నీ ఒక చోటకు చేర్చిందని. తెలిసి ఉక్కిరిబిక్కిరయ్యాను కృతజ్ఞతతో. నిజంగా..అదో అందమైన బహుమతి.

★ ★ ★

వారం తర్వాత.

పెళ్ళికొడుకులా ముస్తాబయ్యున్నా. ఓ వైపు అమ్మ హడావిడి..ఇవతల ఫ్రెండ్స్ జోకులు. తనకు 'ఐ లవ్ యు' అంటూ మెసేజ్ పంపా.

కాసేపటికి నా సెల్‌ఫోన్‌లో ఒకదానివెంట మరో మెసేజ్ వస్తోంది.

''లైఫ్ ఈజ్ ఎ మిస్సింగ్ ఆఫ్ ఎక్స్‌పెక్టెడ్ థింగ్స్

అండ్ ఫేసింగ్ ఆఫ్ అన్‌ఎక్స్‌పెక్టెడ్ థింగ్స్''

''ఆరోజు నన్ను మనస్ఫూర్తిగా స్వీకరించలేకపోయారని తెలుసు. విధి మనిద్దర్నీ ఏడడుగుల బంధంలో ఎలా కలుపుతుందో చూశారా! కొన్ని రోజుల స్నేహం తర్వాత మన మధ్య సఖ్యత లేదన్పిస్తే పెళ్ళి చేసుకోవటం వద్దని నిశ్చితార్థం రోజే మీరన్నప్పుడు నిర్ణయించుకున్నా, ఏదో మూల అరేంజ్‌డ్ మారేజ్ పట్ల మీకున్న విముఖత తొలగించి, నేను మీకు సరైన జీవిత భాగస్వామినని, మిమ్మల్ని ఒప్పించాలని. ఇదంతా పెళ్ళిచూపులకొచ్చే ముందు రోజు మీరు మా ఫామ్‌హౌస్ నేను మిమ్మల్ని యిష్టపడ్డాక..మీరూ నన్ను యిష్టపడేలా చేయటం నా బాధ్యతన్పించింది. ఐతే ఆ యిష్టం తనంతట తానుగా మీలో కలగాలని నే చేసిన ప్రయత్నాలు వృధా కాలేదు. పెళ్ళి మండపంలో నాకోసం ఎదురుచూస్తుండండి. కాసేపట్లో వచ్చేస్తున్నా..''

అందమైన ఊహ నిజమయ్యింది. ఏదో గంటకొడుతున్న శబ్దం విన్పించింది. యింకా విన్పిస్తూనే వుంది నా గుండె గదిలోంచి.

☆